క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. చంపాపేట, అంజిరెడ్డి కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంట నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంజిరెడ్డి, పవన్‌పురి, విష్ణుపురి, ఎంఆర్‌ఆర్, పద్మానగర్, కర్మన్‌ఘాట్, జ్యోతినగర్, రాఘవేంద్ర కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.అలాగే, చంపాపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిఖరాఎన్‌క్లేవ్, పటేల్‌నగర్, ఎస్ఎస్‌రెడ్డి, ఆర్‌టీసీ, రాఘవేంద్ర, నాగార్జున, భానునగర్, సింగరేణి కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ వినియోగ దారులు ఈ విషయంలో తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 83, వంకాయ 40, బెండ 50, పచ్చిమిర్చి 55, కాకర 55, బీర 33, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 55–95, క్యారెట్ 45, దొండ 23–35, చిక్కుడు 40–65, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలు 21, దోస 23, సొర 15, పొట్ల 28, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

‘20 వేల మంది దివ్యాంగులకు లబ్ధి’

- వాసుదేవరెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్



చాదర్‌ఘాట్: గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించడంపై దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల ద్వారా 20 వేల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. బుధవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు ఈ పథకంలో ప్రభుత్వం తరుపున రూ.3 లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ పథకంలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని గతంలో తాము ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరామన్నారు. అందుకు స్పందించిన సీఎం పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారని వాసుదేవరెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గుణాత్మక విద్యతోనే అభివృద్ధి

కాచిగూడ: గుణాత్మక విద్యను అందించగల విద్యాలయాలు అనతికాలంలో అభివృద్ధి చెందుతాయని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి అన్నారు. బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ‘జ్ఞాన సంకల్ప –2023’ పేరుతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. విద్యార్థులు మంచి అలవాట్లను కలిగి ఉండాలని పాఠ్యాంశాలపై ఏకాగ్రతను వహించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు ఇష్టపడి పనిచేయాలని సూచించారు. తెలంగాణ యువతి మండలి వైస్ ప్రెసిడెంట్ ఆర్.పద్మజ మల్లికార్జున్, సెక్రటరీ నివేదితకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ వసుందర, ప్రిన్సిపల్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

కాచిగూడ: హోలీ మదర్ పీజీ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ బద్దం భూపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం బాలాపూర్‌లోని బద్దం భూపాల్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి బీకాం (కంప్యూటర్స్), బీబీఏ కోర్సుల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు డిగ్రీలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సునితాభూపాల్ ప్రకటించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు దోస్త్ కోడ్ 11219 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు 9849006877, 6301358961.

రాజ్యాధికారంతోనే సంక్షేమ ఫలాలు

కాచిగూడ: బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం సాధించినప్పుడే సంక్షేమ ఫలాలు అందుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ అన్నారు. బీసీల హక్కుల సాధనకు ఈనెల 4న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బయలుదేరి వెళ్తున్న బీసీనేతలు, కార్యకర్తలకు బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఆయన జెండా ఊపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహేష్, రాంబాబు, నరేందర్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

- కొత్తపేట డివిజన్‌లో రోడ్లపై డ్రైనేజీ పరుగు
- దుర్వాసనతో అవస్థలు
- రోగాల బారిన స్థానికులు
- భరత్‌నగర్ కాలనీలోని పరిస్థితే దీనికి నిదర్శనం



భరత్‌నగర్ కాలనీలో పారుతున్న డ్రైనేజీ నీరు

నాగోలు: జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్‌లోని కొత్తపేట డివిజన్‌లో ఎక్కడ చూసినా డ్రైనేజీ నీరు వరదలా పారుతోంది. దీంతో కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, శివమ్మనగర్, ఆర్టీసీకాలనీ, శివగంగ కాలనీలతో పాటు పరిసర బస్తీల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ, జల మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. పరిసరాలు ఇలా ఉంటే తమకు రోగాలు రావా అని ఆయా కాలనీలు, బస్తీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- భరత్‌నగర్ కాలనీలో మూడు నెలల నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. ఎగసి వస్తున్న దుర్వాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- రోడ్లపై మురుగు పారుతుండటంతో ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.
- మురుగు నీటితో పరిసరాలు అపరిశుభ్రంగా మారి అంటు వ్యాధుల బారిన పడుతున్నామని, దోమలు పెరిగిపోయి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- భరత్‌నగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్‌లలో నిరంతరం డ్రైనేజీలు పొంగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందించడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

నిధులున్నా... పనులు చేపట్టలేదు

భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ మరమ్మతుల కోసం జలమండలి నుంచి రూ. 51 లక్షల నిధులను కార్పొరేటర్ పవన్‌కుమార్ మంజూరు చేయించారు. టెండర్లు పూర్తై నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దీంతో కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



కొన్ని నెలలుగా భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీలు పొంగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో కాలనీవాసులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

–వెంకటేష్, భరత్‌నగర్ కాలనీ

అనారోగ్యం పాలవుతున్నాం..



భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ఫలితంగా తరచూ డ్రైనేజీలు పొంగి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన ఉండటంలేదు. వర్షం కావడం, రోడ్లపై మురుగు పారుతుండటంతో అనారోగ్యం పాలవుతున్నాం.

– పద్మ, భరత్‌నగర్ కాలనీవాసి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించం: బద్దం



శానిటేషన్ సిబ్బందితో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

చంపాపేట: సర్కిల్ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన సర్కిల్ శానిటేషన్ సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని కోదండరాం నగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి నుంచి చెత్తను తరలించే స్వచ్ఛ ఆటోల సిబ్బంది వారం రోజులుగా గైర్హాజర్ కావటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సిబ్బందిపై జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది బుచ్చయ్య, యాదగిరి, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, యాకయ్య, కాలనీవాసులు సందీప్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని అర్హులైన నిరుపేదలు అందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలోని మురికివాడలు, బస్తీల్లో పార్టీ నాయకులందరం సర్వే చేసి అర్హులైన 500 మంది లబ్ధిదారుల వివరాలు సేకరించామన్నారు. చావునీ డివిజన్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో ఎమ్మెల్యే పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. ఇక్కడి డబుల్ బెడ్రూమ్‌లు నిర్మించి రెండేళ్లైనా లబ్ధిదారులకు కేటాయించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. అధికారులు ఇళ్లు కేటాయించక పోతే తాము నిరుపేదలనే అక్కడికి తీసుకెళ్లి ఇళ్లలోకి చేర్చుతామన్నారు. అనంతరం సురేందర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ రాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సహదేవ్ యాదవ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్ల స్థానంలో కొత్తవి వేయాలి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కొత్తపేట డివిజన్‌లోని సమస్యలు తెలుపుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగోలు కార్పొరేటర్ అరుణ

నాగోలు: ఇటీవల కురిసిన వర్షాలతో కొత్తపేట డివిజన్‌లోని రోడ్లన్నీ కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నూతన రోడ్లు వేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తపేట డివిజన్‌లోని సమస్యలను వివరించారు. డివిజన్‌లోని వివిధ కాలనీలో ఉన్న రోడ్లన్నీ వరదతో జలమయం అయ్యాయన్నారు. కొత్తపేట డివిజన్ మూసీ నదిని ఆనుకొని ఉన్న లోతట్టు ప్రాంతం కావడం వల్ల రోడ్లన్నీ వరదకు కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే నూతన రోడ్లు ఏర్పాటు చేయించాలని కార్పొరేటర్ కోరగా... స్పందించిన కమిషనర్ త్వరలో డివిజన్ వారీగా పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లకు ఎస్టిమేషన్ వేయించి నూతన రోడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

నాగోలు డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కోరారు. కమిషనర్‌ను ఆమె మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోల్ డివిజన్ లోని అన్ని కాలనీలోని సమస్యలపై చర్చించి, వాటిని వెంటనే పూర్తి చేయాలని వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్ తొందరగా పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

పార్కుల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

ఎల్‌బీనగర్: పార్కుల నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దని, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ పార్క్‌ను హెచ్ఎండీఏ ఏఈ జీవన్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీ వాసులు కొద్దిసేపు తీరేందుకు, వాకింగ్‌కు, చిన్నపిల్లలు ఆడుకోవడానికి వస్తుంటారని టాయిలెట్స్ శుభ్రంగా ఉంచడంతో పాటు చెట్లకు నీళ్ల పట్టాలని సిబ్బందికి సూచించారు.



రాజీవ్ గాంధీ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

రోడ్లు, డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలి



కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలతో చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలకు తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీ, ద్వారకా తిరుమల కాలనీ, భీమానగర్ కాలనీల్లో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసినట్‌లైతే వరద ముంపు సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని, అధికారులు వెంటనే పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, కాలనీ ప్రతినిధులు మమత, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

తిరుపతమ్మ భక్తుల విశ్రాంతి భవనానికి రూ.70 లక్షల విరాళం



భవన నిర్మాణ అంగీకార పత్రాలను ఈఓ రమేష్ నాయుడుకి అందిస్తున్న దాతలు నరేష్, శ్రీను

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో వేంచేసిన తిరుపతమ్మ ఆలయం వద్ద భక్తుల విశ్రాంతి భవన నిర్మాణం కోసం హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన చిన్నం యాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నరేష్, అల్లుడు టి.శ్రీను బుధవారం ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడుకి రూ.70 లక్షల విరాళం ఇచ్చేందుకు బుధవారం అంగీకార పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ, తమ ఇలవేల్పు తిరుపతమ్మవారి ఆలయం వద్ద రూ.70 లక్షలతో భక్తుల విశ్రాంతి మందిరాన్ని నిర్మించి ఇస్తామని అంగీకార పత్రాలు ఇచ్చామన్నారు. ఈఓ మాట్లాడుతూ.. దాతలకు భవన నిర్మాణంలో అన్ని విధాలా సహకరిస్తామని, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా లోపాలు లేకుండా నిరంతరం పరిశీలన చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులపై రాళ్ల దాడి అమానుషం: వీహెచ్‌పీ



మతోన్మాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సైదాబాద్: యాత్రికులపై ఉన్మాదంతో రాళ్ల దాడికి పాల్పడటం అమానుషమని వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ మండిపడ్డారు. హర్యానాలో మేవాత్ యాత్రలో పాల్గొన్న వారిపై రాళ్లతో దాడి చేసిన వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యాత్రికులపై రాళ్ల దాడిని నిరసిస్తూ బుధవారం సాగర్ జాతీయ రహదారిపై వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మతోన్మాద జిహాదీ దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. అనంతరం రావినూతల శశిధర్ మాట్లాడుతూ, హర్యానాలో జరిగిన ఘటనలో ఇద్దరు హోంగార్డులు సహా ఆరుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కళ్లెం రాజేందర్‌రెడ్డి, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ మహేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు గుడాల రవీజీ, సంజయ్‌శర్మ, వెంకన్న, అరుణ్ సాగర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్త పనులతో ప్రజలకు అవస్థలు: సామ



కాలనీవాసులకు కేంద్ర పథకాలను వివరిస్తున్న సామ రంగారెడ్డి

లింగోజీగూడ: ప్రణాళిక లేకుండా చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. శాఖల మధ్య సమన్వయం లేకుండా అస్తవ్యస్తంగా పనులు చేస్తుండటంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగారెడ్డి లింగోజీగూడ డివిజన్ పరిధిలో అధికారినగర్, ధర్మపురి కాలనీ, అల్తాఫ్‌నగర్‌ల్లో బీజేపీ నాయకులు, కార్యర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కాలనీల్లోని సమస్యలు తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలాల్లోకి అక్రమంగా డ్రైనేజీలు కలపడంతో డ్రైనేజీ నీరు చెరువులోకి చేరి కలుషితమవుతోందని తెలిపారు. కాలనీలలో రోడ్లపై మురుగు నీరు నిలిచి కాలనీల వాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, రాకేష్‌యాదవ్, కృష్ణం రాజు, రాజ్‌కిరణ్, మల్కాజిగిరి నాగరాజు, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, పవన్‌కుమార్, సాయి, రాజు గౌడ్, ఈశ్వర్, కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో కనీస వసతుల్లేవు..!

- శిథిలావస్థకు చేరిన డ్వాక్రా భవన్‌లో కొనసాగింపు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో గర్భిణులు, చిన్నారులు



మీర్‌పేట: శిథిలావస్థకు చేరిన డ్వాక్రా భవన్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మీర్‌పేట: అంగన్‌వాడీలో కనీస వసతులు కరువయ్యాయి. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఫేజ్–1లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా డ్వాక్రా భవన్‌లోనే కొనసాగుతోంది. ఈ కేంద్రానికి మొత్తం గర్భిణులు, బాలింతలు కలిపి 25 మంది, మరో 20 మంది పిల్లలు వస్తుంటారు. వారు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి లోపల పెచ్చులూడిపోవడంతో వర్షం పడినప్పుడల్లా కురుస్తుందని వారు తెలిపారు. అదే విధంగా టాయిలెట్స్ లేకపోవడంతో గర్భిణిలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న పిల్లలు కూడా మల, మూత్ర విసర్జనకు రోడ్డుపై వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారు తమతమ ఇళ్లకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని చిన్నారులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని నూతన భవనంలోకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, అల్మాస్‌గూడ, వెంకటాపూర్, మల్లాపూర్, కుర్మల్‌గూడ, కమ్మగూడ, గుర్రంగూడ అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు అంతంత మాత్రమే వస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం, అన్నం అందిస్తున్నప్పటికీ సొంత భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. కొన్ని చోట్ల నీటి కొరత తీవ్రంగా ఉంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒంటికి, రెంటికి చిన్నారులు పోయినప్పుడు నీళ్లు లేక ఇంటికి పంపించే దుస్థితి నెలకొంది. కొన్ని సెంటర్లు చాలా బాగా నడుస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పడంలేదని వారు చెబుతున్నారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మునిసిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సదుపాయాలు కరువవ్వడంతో సిబ్బంది, చిన్నారులకు అసౌకర్యాలు తప్పడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి గ్రామం, శ్రీరాం కాలనీ, పహాడిషరీఫ్, వాదే ముస్తఫా, ఎర్రకుంట, షాహిన్‌నగర్, కొత్తపేటలోని కేంద్రాలలో విద్యుత్ సమస్య, మూత్రశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల్‌పల్లి గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గర్భిణీలు, బాలింతలు, సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు.



బడంగ్‌పేట్: గాంధీనగర్‌లోని అంగన్‌వాడీలో చిన్నారులు



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ భవనం